సాక్షి శ్రీకాకుళం

ఆదివారం । 15 । జూన్ । 2025



వేట మొదలు

వేట నిషేధ కాలం ముగిసింది. మత్స్యకారులు వేటకు సంసిద్ధమయ్యారు.

- IIలో

మద్యం షాపు తాత్కాలికంగా బంద్

ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం ఉన్నత పాఠశాల సమీపంలో ఏర్పాటు చేసిన మద్యం షాపును శనివారం నిర్వాహకులు బంద్ చేశారు. పాఠశాలకు ఆమడ దూరంలో ఏర్పాటు చేసిన మద్యం షాపును తొలగించాలంటూ గత ఐదు రోజులుగా విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆందోళన చేస్తున్నారు. దీంతో పాటు శుక్రవారం ఉన్నత పాఠశాల విద్యార్థులు బడికి రాకుండా బాయ్‌కాట్ చేయడంతో ఉన్నతాధికారులు స్పందించారు. తాత్కాలికంగా మద్యం షాపును తెరవకూడదని జిల్లా ఎక్సైజ్ కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం షాపును బంద్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ పీడీ ప్రసాదరావు తెలిపారు.



ఈదుపురం ఉన్నత పాఠశాల వద్ద నూతన మద్యం షాపును తాత్కాలికంగా బంద్ చేసిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

నీట్‌లో మేటిగా..

ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ యూజీ–2025 ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మెరుగైన ర్యాంకులు సాధించి డాక్టర్ కావాలనే కలను సాకారం చేసుకునే దిశగా మొదటి అడుగు వేశారు.



పాదిలాపు అవినాష్

64వ ర్యాంకు

శ్రీకాకుళం న్యూకాలనీ: అరసవల్లి సమీపంలో నివాసంటున్న పాదిలాపు అవినాష్ ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 64వ ర్యాంకు సాధించాడు. మొత్తం 720 మార్కులకుగాను 652 మార్కులు సాధించి రాష్ట్రంలో టాప్ 5 జాబితాలో చోటు దక్కించుకున్నాడు. విద్యార్థి తల్లిదండ్రులు పాదిలాపు శ్రీనివాసరావు, భారతి. తండ్రి మెడికల్ ఫీల్డ్‌లో బిజినెస్ చేస్తుండగా, తల్లి గృహిణి.



సమీర్ కుమార్ (70 ర్యాంకు)

పాతపట్నం: పాతపట్నం శాంతినగర్‌కు చెందిన విద్యార్థి ఎర్ర సమీర్‌కుమార్ ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరీలో 70వ ర్యాంకు, ఓబీసీ కేటగిరిలో 17వ ర్యాంకు సాధించాడు. తండ్రి ఎర్ర ధర్మారావు ఒడిశాలో ఉపాధ్యాయుడిగా, తల్లి జగదాంబ ఏఎన్ఎంగా పనిచేస్తున్నారు.



మేఘసాయివర్ధన్ (942 ర్యాంకు)

సోంపేట: సోంపేట పట్టణానికి చెందిన రొబ్బి మేఘ సాయివర్ధన్‌కు నీట్‌లో ఆలిండియా 942 ర్యాంకు వచ్చింది. సాయివర్ధన్ తల్లిదండ్రులు ముప్పన ఈశ్వరి, రొబ్బి ధర్మారావు ఇద్దరూ టీచర్లే.



తర్ర మైత్రి (948 ర్యాంకు)

పోలాకి: మండలంలోని తోటాడ గ్రామానికి చెందిన తర్ర మైత్రి శనివారం విడుదలైన నీట్ ఫలితాల్లో సత్తాచాటింది. ఓబీసీ కేటగిరీలో ఆల్ ఇండియా 948 ర్యాంక్ సాధించింది. ఇటీవల విడుదలైన ఈఏపీసెట్‌లో అగ్రికల్చర్ విభాగంలో 33వ ర్యాంక్‌తో టాపర్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. మైత్రి తల్లిదండ్రులు ప్రభావతి, వైకుంఠరావులు ఉపాధ్యాయులు.



పాగోటి జుహిత (2744 ర్యాంకు)

సారవకోట: మండలంలోని అలుదు గ్రామానికి చెందిన పాగోటి జుహిత జాతీయ స్థాయిలో 2744వ ర్యాంకు, ఓబీసీ కేటగిరిలో 979 ర్యాంకు సాధించింది. తండ్రి పాగోటి మురళీధర్ ఎయిర్ ఫోర్స్‌లో రిటైర్ ప్రస్తుతం బ్యాంకులో పనిచేస్తున్నారు. తల్లి హేమలత గృహిణి.



శృతి (3202 ర్యాంకు)

నరసన్నపేట: స్థానిక మారుతీ నగర్‌కు చెందిన సూరపు ఝాన్సీ లక్ష్మి శృతి నీట్‌లో జాతీయ స్థాయిలో 3202వ ర్యాంకును, ఓబీసీ కేటగిరీలో 1150వ ర్యాంకు సాధించింది. శృతి తల్లిదండ్రులు సూరపు కృష్ణారావు, సుధారాణి వైద్యులు. శృతి తాత మెండ యయాతి కూడా వైద్యుడే.



శ్రీకర్‌కశ్యప్ (7205 ర్యాంకు)

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన లఖినాన శ్రీకర్‌కశ్యప్ ఆల్ ఇండియా స్థాయిలో 7205, ఓబీసీలో 2936వ ర్యాంకు సాధించాడు. తల్లిదండ్రులు లఖినాన వెంకటాచలం, శ్రీదేవి ఇద్దరూ టీచర్లు.

కనిపెంచే దేవుడు



ఒక్కో ఇంటిలో ఒక్కో కథ. కన్నీటితో కూడినవి కొన్ని.. విజయాలతో మురిసినవి మరికొన్ని.. వ్యధలతో నిండినవి ఇంకొన్ని. అన్ని కథల్లోనూ హీరో నాన్నే. అమ్మపై ప్రేమ ప్రపంచం మొత్తానికి తెలిస్తే.. నాన్నపై మమకారం గుండె గది దాటి బయటకు రాదు. ఇది అవ్యక్తానుభూతి. నేడు ఫాదర్స్ డే. ఈ సందర్భంగా కొందరు తమ గుండెను గొంతుగా చేశారు. నాన్నపై ఉన్న ప్రేమను అనుభవాల్లో తెలిపారు. మమకారాన్ని అక్షరాల్లో నింపారు.

- శ్రీకాకుళం కల్చరల్, జలుమూరు, జి.సిగడాం, నరసన్నపేట, శ్రీకాకుళం

మా నాన్న నా అదృష్టం



మానాన్న పాగిరి జగన్నాథం స్కూల్ టీచర్. నాకు చిన్నతనం నుంచి చదువు ప్రాముఖ్యత చెబుతూ పెంచారు. సమాజాన్ని కూడా చదవాలని చెప్పారు. ఆయన స్ఫూర్తితోనే నా 45వ ఏట పీహెచ్‌డీ పూర్తి చేశాను. మా నాన్న నేర్పిన పాఠాలే నన్ను ఇంతవాడిని చేశాయి. మా గ్రామం వెళితే ఇప్పటికి మా నాన్న నాకు ఏదో ఒకటి చెబుతూనే ఉంటారు. అంత మంచి నాన్న ఉండడం నా అదృష్టం అని అందుకే అంటాను.

– పాగిరి సుగుణాకరరావు, సూపరింటెండెంట్ ఇంజినీర్, సుడా, శ్రీకాకుళం

తండ్రి ఆశయాలను కొనసాగిస్తున్నాం..



మా నాన్న అప్పారావు నాయుడు గ్రామ కరణంగా పనిచేస్తూ మరో పక్క నాటక రంగానికి మకుటం లేని మహారాజులా ఎదిగారు. ఆయనకు మాతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నాటక రంగంతో పాటు చదువు కూడా ప్రధానమేనని మాకు చెప్పి పెంచారు. ఇటు చదువులు, అటు నాటక రంగంపై కూడా మా ఇద్దరం విశేష కృషి చేస్తూ నాన్న ఆశయాలు సాధిస్తున్నాం. – మెట్ట పోలినాయుడు, పంచాయతీ శాఖలో ఇంజినీర్, – మెట్ట వెంకటరాజు, జుడీషియల్ డిపార్ట్‌మెంట్‌లో సూపరింటెండెంట్

నాన్న త్యాగశీలి



మా అన్నదమ్ముల ఉన్నత భవిష్యత్ కోసం మా తండ్రి చంద్రరావు ఎన్నో త్యాగాలు చేశారు. మా కోసం ఆయన జీవితాన్ని ధారబోశారు. మా తల్లిదండ్రులు రోహిణి, చంద్రరావు పెద్దగా చదువుకోలేదు. మాది వ్యవసాయ కుటుంబం. అయినా మా తమ్ముడు బాన్న వంశీ, నేను ఉన్నత స్థాయికి ఎదగాలని చిన్నప్పటి నుంచి ఇంగ్లిష్ మీడియంలో చదివించారు. మేం ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్నప్పుడు మాకంటూ ఓ గుర్తింపు రావాలని నాన్న ఎంతో తపించేవారు. మా తమ్ముడు వంశీకి లాంగ్‌టెర్మ్ కోచింగ్ ఇప్పించి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ టెక్నాలజీ త్రివేండ్రంలో ఇంజినీరింగ్ చదివించారు. అతను శ్రీహరి కోటలో శాస్త్రవేత్తగా స్థిరపడ్డాడు. నేను ఐపీఎస్ శిక్షణ తీసుకుంటూ మరోవైపు ఐఏఎస్ సాధించాను.

– బాన్న వెంకటేష్, సివిల్స్ విజేత



17 ఏళ్ల కుమారుడికి అన్నీ తానై..

నరసన్నపేట మండలం జమ్ముకు చెందిన ఎలమంచి రోహిత్‌కు 17 ఏళ్లు. పుట్టుకతోనే దివ్యాంగత్వం ఉంది. కదల్లేని స్థితిలో ఉన్న రోహిత్‌కు తండ్రి గణపతి అన్నీ తానై చూసుకుంటున్నారు. 17 ఏళ్లుగా ఇదే ఆయన దినచర్య. మెకానిక్‌గా పనిచేసుకుంటూనే కుమారుడికి అనునిత్యం సపర్యలు చేస్తున్నారు.

ఇంటి ఆవరణలో తండ్రి విగ్రహం

జి.సిగడాం మండలం ధవళపేట గ్రామానికి చెందిన పీవీఎస్ సంస్థల ఫౌండర్ పీవీఎస్ రామ్మోహన్ తండ్రి వెంకట స్వామిని నిరంతరం స్మరించుకుంటున్నారు. ఇంటి ముందే తండ్రి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుని ప్రతిరోజూ విగ్రహానికి పూజలు చేస్తున్నారు.



వందకొర్రీల వందనం

- ఆంక్షల ముసుగులో తల్లికి వందనం ఎగనామం
- రూ.3వేల జీతం తీసుకునే సర్పంచ్, ఎంపీటీసీలకు మొండిచేయి
- అంగన్‌వాడీ తదితర చిరుద్యోగులకు పంగనామం
- పథకం ఎగ్గొట్టడమే లక్ష్యంగా నిబంధనలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

తల్లికి వందనం పథకం లబ్ధిదారులను కుదించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పెట్టుకుంది. ఇప్పటికే ఏడాది అయిపోవడంతో ప్రజల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత వస్తుండటంతో తల్లికి వందనం పథకాన్ని కొంతమందికి ఇచ్చి, అమలు చేసేశామని చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తోంది. రూ.3వేల జీతం తీసుకునే సర్పంచ్‌లు, ఎంపీటీసీల దగ్గరి నుంచి రూ.12వేల లోపు జీతం తీసుకునే చిరుద్యోగుల వరకు కోత పెట్టింది. 300యూనిట్ల విద్యుత్ బిల్లు వచ్చే వారికి కూడా మొండి చేయి చూపింది.



అంతా గోప్యత..

తల్లికి వందనం లబ్ధిదారుల విషయంలో కూటమి ప్రభుత్వం గోప్యత పాటిస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఎంతమంది అర్హులో క్లారిటీ ఇవ్వడం లేదు. డీఈఓను అడిగితే తనకేం రాలేదని అంటుండగా, సచివాలయం కో ఆర్డినేటర్‌ను అడిగినా అదే సమాధానం వస్తోంది. పంచాయతీల వారీగా అర్హులు, అనర్హుల జాబితాను విడుదల చేశారే తప్ప జిల్లా యూనిట్‌గా లబ్ధిదారులు ఎంతన్నది ఎవరూ చెప్పలేకపోతున్నారు.

కొందరికే లబ్ధి

ఎంతమంది ఉంటే అంతమందికి తల్లికి వందనం కింద రూ.15వేలు ఇస్తామని, లబ్ధి చేకూర్చే విషయంలో ఎలాంటి ఆంక్షలు పెట్టేది లేదని, గత ప్రభుత్వంలా రూ.13వేలు కాకుండా పూర్తి స్థాయి మొత్తాన్ని అందజేస్తామని జిల్లా పర్యటనలో చంద్రబాబు, లోకేష్, ఆ పార్టీ ప్రస్తుత మంత్రులు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక ఆంక్షలతో పథకాలకు పంగనామం పెడుతున్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో చిరుద్యోగులకు సంక్షేమ పథకాలు అందించారు. ఇప్పుడీ కూటమి రూ.3వేల జీతం తీసుకుంటున్న ప్రజాప్రతినిధులతో పాటు చిరుద్యోగులకు మొండి చేయి చూపారు. జిల్లా వ్యాప్తంగా 6,017మంది అంగన్‌వాడీలకు తల్లికి వందనం అందలేదు. వీరంతా ఈనెల 18న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసేందుకు సిద్ధమవుతున్నారు.

ఇద్దరుంటే ఒకరికే..

కోటబొమ్మాళికి చెందిన డీవీ రమణకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఒకరు ఏడో తరగతి, మరొకరు ఆరో తరగతి చదువుతున్నారు. ఇద్దరు పిల్లల్లో ఒకరికే పథకం వచ్చింది. మరొకరికి వస్తుందో రాదో కూడా తెలియడం లేదు. గతంలో జవాబుదారీతనం ఉండేది. ఇప్పుడు ఎవరిని అడిగినా సమాచారం లేదంటూ దాట వేస్తున్నారని ఆ తండ్రి వాపోతున్నారు.

సర్పంచ్ పదవి ఉద్యోగమా..?



వైఎస్ జగన్ సీఎంగా ఉన్నప్పుడు సర్పంచ్‌లకు అమ్మ ఒడి డబ్బులు వచ్చేవి. కానీ కూటమి ప్రభుత్వం సర్పంచ్‌లను ఉద్యోగులుగా భావించి తల్లికి వందనం పథకానికి అనర్హులను చేసింది. పథకాల డబ్బులు ఇవ్వకుండా ఎగ్గొట్టడం చంద్రబాబుకు తెలిసినంతగా మరే రాజకీయ నాయకునికి తెలియదనడానికి ఇదో నిదర్శనం.

– ముద్దాడ మోహిని, సర్పంచ్, దబ్బపాడు, ఎల్.ఎన్.పేట

ఆంక్షలు అన్యాయం



అమలు చేయడానికి వంద కొర్రీలు పెట్టి మళ్లీ దానికి తల్లికివందనం అనే పేరు పెట్టడం అన్యాయం. మా పంచాయతీలో సర్పంచ్‌గా ఉన్న నాకు, ఎంపీటీసీగా ఉన్న కైబాడ సుజాతతో పాటు మరో ఇరవై నాలుగు మందికి అనేక కొర్రీలతో డబ్బులు వేయలేదు. తల్లికి వందనం.. కొంతమందికే.. అని ప్రభుత్వం ప్రచారం చేసుకుంటే బాగుంటుంది.

– చింతు ప్రమీల, సర్పంచ్, బెలమరపాలవలస

ప్రభుత్వం మోసం చేసింది



గత ప్రభుత్వం కంటే ఎక్కువ పథకాలు ఇస్తామని చెప్పారు. ఇప్పుడేమో మమ్మల్ని ఉద్యోగులుగా చూపించి తల్లికి వందనం కట్ చేసేశారు. ప్రభుత్వం మోసం చేసింది. గత వైఎస్ జగన్ ప్రభుత్వంలో అమ్మఒడి ఇచ్చారు. రేషన్‌కార్డులు అందించారు. ఇప్పుడీ ప్రభుత్వం సంక్షేమ పథకాలే కాదు రేషన్‌కార్డులు కూడా తొలగిస్తామని చెబుతోంది. పనిభారం చాలా ఎక్కువగా ఉంది. దీనిపై ఈ నెల 18న కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తాం.

– మహంతి కల్యాణి, అంగన్‌వాడీ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు

క్లుప్తంగా

భాస్కరరావుకు 'బాలు' స్మారక పురస్కారం


కె.భాస్కరరావు

శ్రీకాకుళం కల్చరల్: నగరానికి చెందిన ఫిల్మ్ డబ్బింగ్ ఆర్టిస్టు, ఆల్ ఇండియా రేడియో బి–గ్రేడ్ గాయకుడు కె.భాస్కరరావు డాక్టర్ ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం స్మారక పురస్కారానికి ఎంపికయ్యారు. ఘంటసాల, బాలు, ఆనంద్ (జి.బి.ఎ) స్వరమాధురి వెల్ఫేర్ అండ్ సర్వీస్ సొసైటీ నిర్వాహకులు ఈ నెల 16న బాపూజీ కళామందిర్‌లో జరిగే జయంత్యుత్సవ కార్యక్రమంలో సత్కరించనున్నారు. భాస్కరరావు మూడు దశాబ్దాలుగా గాయకునిగా, సామాజిక సేవకుడిగా అందిస్తున్న సేవలను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. గతంలో ఈయన హైదరాబాద్ తెలుగు విశ్వవిద్యాలయంలో లలిత సంగీతం డిప్లమో కోర్సులో ఉత్తమ విద్యార్థి పురస్కారాన్ని అందుకున్నారు. ప్రస్తుతం ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా కొనసాగుతూనే పార్ట్ టైం ప్రాతిపదికన కోటబొమ్మాళి జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో డ్రాయింగ్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. భాస్కరరావుకు పురస్కారం ప్రకటించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

సీపీఐ జిల్లా కార్యవర్గం ఎన్నిక

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పాతపట్నం మండల కేంద్రంలో రెండు రోజులపాటు జరిగిన సీపీఐ 25వ జిల్లా మహాసభలు ఘనంగా ముగిశాయని పార్టీ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ తెలిపారు. శనివారం జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పేదల సమస్యలపై పోరాటేందుకు కమ్యూనిస్టు పార్టీ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. అనంతరం పార్టీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పార్టీ జిల్లా కార్యదర్శిగా చాపర వెంకటరమణ, జిల్లా సహాయ కార్యదర్శిగా లండ వెంకటరావు, కార్యవర్గ సభ్యులుగా చాపర సుందర్‌లాల్, కొన్న శ్రీనివాస్, ఎస్.నారాయణస్వామి, పి.అరేలమ్మ, ఎస్.హరికృష్ణ, బి.సంతోష్‌లను, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. వీరితోపాటు 31 మంది సమితి సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మొజ్జాడ యుగంధర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొన్న శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్ వెబ్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

ఎచ్చెర్ల: పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు పాలిటెక్నికల్ డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలు కల్పించడానికి ఉద్దేశించిన ఏపీ పాలిసెట్ –2025 వెబ్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైనట్లు సహాయ కేంద్రం జిల్లా సమన్వయకర్త, శ్రీకాకుళం పురుషుల పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.జానకిరామయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు ఈ నెల 20లోగా ప్రోసెసింగ్ ఫీజు చెల్లించాలన్నారు. ఓసీ, బీసీలు రూ.700, ఎస్సీ, ఎస్టీలు రూ.250 చొప్పున ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. ప్రోసెసింగ్ ఫీజు రసీదు, ఫీజు, పాలిసెట్ హాల్‌టికెట్, ర్యాంక్ కార్డు, పదో తరగతి ధ్రువపత్రం, నాలుగు నుంచి పదో తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్, ఈడబ్ల్యూఎస్, కుల, ఆదాయ ధ్రువపత్రాలు, టీసీ సర్టిఫికెట్లతో శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల పాలిటెక్నిక్ కళాశాల సహాయ కేంద్రానికి హాజరుకావాలని సూచించారు. ఈ నెల 21 నుంచి 28 వరకూ ధ్రువపత్రాల పరిశీలన, వెబ్ ఆప్షన్ నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ప్రత్యేక కేటగిరి వారికి ఈ నెల 25 నుంచి 28 వరకూ విజయవాడలో బెంజి సర్కిల్ సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సిలింగ్ జరుగుతుందని పేర్కొన్నారు. తొలివిడత కౌన్సిలింగ్‌కు సంబంధించి బ్రాంచ్‌లు, కళాశాలల కేటాయింపు జాబితాలు వచ్చే నెల 3న విడుదలవుతాయన్నారు.

ఈ నెల 21న 1 నుంచి 15 వేల ర్యాంకు, 22న 15,001 నుంచి 32000 వరకు, 23న 32001 నుంచి 50000 వరకు, 24న 50001 నుంచి 68,000 వరకు, 25న 68,001 నుంచి 86000 వరకు, 26న 86,001 నుంచి 1,04,000 వరకు, 27న 1,04,000 నుంచి 1,20,000 వరకు 28న 1,20,000 నుంచి చివరి ర్యాంక్ వరకూ ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని వివరించారు. జూలై 1న వెబ్ ఆప్షన్ల మార్పులు, చేర్పులు చేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

వేట మొదలు!


బోట్లను సిద్ధం చేసుకుంటున్న మత్స్యకారులు

- ముగిసిన వేట నిషేధ కాలం
- సముద్ర తీరంలో వేటకు అనుమతులు
- 61 రోజులుగా ఉపాధి కోల్పోయిన వేటమత్స్యకారులు
- గతేడాది నిషేధ భృతిపై ఇంకా నీలినీడలు
- పెండింగ్‌లో 15860 మందికి భృతి చెల్లింపులు

అరసవల్లి: గంగపుత్రులు సముద్రంలో వేటకు సిద్ధమయ్యారు.. రెండు నెలలుగా వేటకు దూరమై.. ఉపాధి కోల్పోయిన మత్స్యకారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించిన నిషేధ సమయం అర్ధరాత్రితో ముగిసింది. దీంతో యధావిధిగా ఎలాంటి షరతులు, నిబంధనలు లేకుండా సముద్రంలోకి వేటకు మరబోట్లతో వెళ్లేందుకు అనుమతులు వచ్చేశాయి. ఏపీ మెరైన్ యాక్ట్ 1994 ప్రకారం ప్రతి ఏటా ఏప్రిల్ 14వ తేదీ అర్ధరాత్రి నుంచి జూన్ 14వ తేదీ అర్ధరాత్రి వరకు వేట నిషేధ కాలంగా అమల్లో ఉండడంతో ఉపాధి కోల్పోయిన క్రమంలో వీరికి భృతిగా నగదు, డీజిల్ సబ్సిడీలను గత ప్రభుత్వం వరుసగా ఐదేళ్లుగా చెల్లించింది. ప్రస్తుత ప్రభుత్వం మాత్రం ఒక ఏడాది భృతి ఎగ్గొట్టేసింది. ఈ ఏడాదికి మాత్రం భృతిని రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచుతున్నట్లుగా ప్రకటించి...అర్హులకు కాకుండా కూటమి నేతల సిఫారసులున్నవారికి మాత్రమే భృతి జమ చేసింది. అయితే గతేడాది చెల్లించాల్సిన సుమారు రూ.31.72 కోట్ల మేరకు చెల్లించాల్సిన భృతిపై రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. పెండింగ్ భృతిని కూడా చెల్లిస్తామని ప్రభుత్వ పెద్దలు చెప్పినప్పటికీ ఎలాంటి చెల్లింపులు ఇంతవరకు జరగలేదు. దీంతో బాధిత మత్స్యకారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్ల ప్రభుత్వం పాలన ఉంటుందని.. అలాంటిది వేటనిషేధ భృతిని అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే పెండింగ్‌లో పెట్టడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

గత ఏడాది భృతికి మంగళం!

గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు 2014–19 మధ్యకాలంలో కూడా వేటనిషేధ సమయంలో కేవలం రూ.4 వేలు చొప్పున ఉపాధి భృతిగా ఇచ్చేవారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ మొత్తాన్ని రూ.10 వేలకు పెంచుతూ, డీజిల్ సబ్సిడీని కూడా అందించింది. మొత్తం ఐదేళ్లలో 70,611 మందికి రూ.70.61 కోట్లను వారి వ్యక్తిగత ఖాతాల్లోకి జమ చేయించి మత్స్యకారుల జీవన ప్రమాణాలు పెరిగేలా జగన్ సర్కార్ అడుగులు వేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2024–25లో వేటనిషేధ కాలంలో ఉపాధి కోల్పోయిన మత్స్యకారులకు భృతిని గాలికొదిలేసింది. గతేడాది అర్హులుగా సర్వేలో గుర్తించిన 15,860 మందికి రూ.31.72 కోట్ల మేరకు వేట నిషేధ భృతి పెండింగ్‌లో పడినట్లయ్యింది. ఇంతవరకు ఎలాంటి నోటిఫికేషన్ విడుదల చేయకుండా, కనీస స్పష్టత ఇవ్వకపోవడంతో మత్స్యకారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

ఆంక్షలతో అవస్థలు..

జిల్లాలో 11 మండలాల్లో మత్స్యకార కుటుంబాలు సముద్రపు వేటతో జీవనాధారంగా సాగిస్తున్నారు. ఇందులో ఈ ఏడాది వేట నిషేధ కాలంలో భృతిగా 15548 మందికి రూ.20 వేల చొప్పున మొత్తం రూ.31.09 కోట్ల భృతిని ఏప్రిల్ 26న జమ చేశారు. ఇందులో అర్హులైన చాలా మంది వేటదారులకు భృతి ఇవ్వకుండా ఆంక్షలు విధించారు. రాజకీయ కారణాలు ఒకవైపు కాగా.. విద్యుత్ వినియోగం తదితర నిబంధనలతో భృతి అందకుండా చేశారు. భృతి పొందిన వారికి ప్రభుత్వ ఇతర పథకాలు లబ్ధి ఉండదని కూడా స్పష్టం చేయడంతో మత్స్యకారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలావుంటే ఈ ఏడాది వేట నిషేధ భృతికి మొత్తం 511 మందిని అనర్హులుగా మత్స్యశాఖాధికారులు ప్రకటించారు. శ్రీకాకుళం రూరల్‌లో 31, గారలో 106, ఎచ్చెర్లలో 60, రణస్థలంలో 106, కవిటిలో 61, వజ్రపుకొత్తూరులో 35, పోలాకిలో 41, సోంపేటలో 32, సంతబొమ్మాళిలో 27, ఇచ్ఛాపురంలో 08, మందసలో 04 చొప్పున మత్స్యకారులు అనర్హులుగా గుర్తించారు. వాస్తవానికి ఈ లెక్క 1200 మంది వరకు ఉన్నట్లుగా మత్స్యకార సంక్షేమ సంఘాల ప్రతినిధులు చెబుతున్నారు.

భృతి చెల్లించాల్సిందే...



జిల్లాలో గత ప్రభుత్వం వరుసగా ఐదేళ్ల పాటు వేట నిషేధ భృతి చెల్లించింది. అర్హులందరికీ ఎలాంటి ఆంక్షలు లేకుండా చెల్లించింది. కూటమి ప్రభుత్వం మాత్రం అనవసర నిబంధనలు పెట్టి అర్హుల సంఖ్యను కుదించేసింది. దీంతో పాటు గతేడాది చెల్లించాల్సిన వేట నిషేధ భృతిని కూడా రూ.20 వేల చొప్పున అందించాలి.

– కోనాడ నర్సింగరావు,
మాజీ అధ్యక్షుడు, డీఎఫ్‌సీఎస్

● మృతులకు సంతాపం



అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో మృతి చెందిన వారికి నివాళులు అర్పిస్తూ శనివారం టెక్కలిలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఆధ్వర్యంలో టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. – టెక్కలి

మున్సిపల్ ఇంజినీర్లకు బదిలీలు

శ్రీకాకుళం: నగర పాలక సంస్థలో పలువురు ఉద్యోగులకు బదిలీలు జరిగాయి. మున్సిపాల్ ఇంజినీరింగ్ అధికారి దక్షిణామూర్తికి విశాఖపట్నం బదిలీ అయ్యింది. ప్రస్తుతం ఎఫ్ఏసీ ఎంఈగా ఉన్న కమలాకర్ అదే పోస్టులో కొనసాగుతారు. డీఈఈగా పనిచేస్తున్న కార్తీక విశాఖపట్నం వీఎంఆర్‌డీఏకు బదిలీ అయ్యారు. ఈ స్థానంలో ఎవరినీ నియమించలేదు. శ్రీకాకుళంలో ఏఈగా పనిచేస్తున్న కిరణ్‌కు విశాఖపట్నం బదిలీ కాగా ఆ స్థానంలో విశాఖపట్నంలో పనిచేస్తున్న సత్యనారాయణను నియమించారు. టీపీఓగా పనిచేసిన ఉమామహేశ్వరరావు మూడు నెలల క్రితం ఉద్యోగ విరమణ చేయగా అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉండిపోయింది. ఆ పోస్టులో తాజాగా ఆమదాలవలసలో టీపీఓగా పనిచేస్తున్న వెంకటరమణను నియమించారు. ఈ మేరకు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు.

టీడీపీలో వర్గపోరు


పార్టీ కార్యకర్తలను సర్దిచెప్పేందుకు ప్రయత్నిస్తున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, పోలీసులు

- లావేరు మండల టీడీపీ కమిటీ ఎన్నిక రసాభాస
- తెలుగు తమ్ముళ్ల తోపులాట
- రంగంలోకి దిగిన పోలీసులు

ఎచ్చెర్ల: తెలుగుదేశం పార్టీలో వర్గపోరు బహిర్గతమైంది. శుక్రవారం నిర్వహించిన లావేరు మండల టీడీపీ కమిటీ ఎన్నిక రసాభాసగా మారింది. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఓ కల్యాణ మండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వచ్చిన పలు పంచాయతీల తెలుగు తమ్ముళ్ల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టారు. కొందరు పాత కమిటీనే కొనసాగించాలని కోరగా, మరికొందరు కొత్త కమిటీను నియమించాలని కోరారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ మొదలైంది. ఎంపీ జోక్యం చేసుకుని ఇలా గొడవ చేస్తే సహించేది లేదని చెప్పినా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో తోపులాట జరగడంతో లావేరు పోలీసులు రంగంలోకి దిగి ఇరువర్గాలను సముదాయించే ప్రయత్నం చేశారు. చేసేదేమీ లేక ఎంపీ వెనుదిరిగారు. కాగా, ప్రస్తుతం మండల పార్టీ అధ్యక్షుడిగా ముప్పిడి సురేష్ కొనసాగుతున్నారు. ఈయన బదులుగా కొత్తపల్లి సర్పంచ్ ఆరవెల్లి కృష్ణను ఎన్నుకునేందుకు పలు పంచాయతీల టీడీపీ నాయకులు సిద్ధమయ్యారు. దీంతో ఇరువరు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. చివరికి ఎటూ తేల్చలేక ఎంపీ వాయిదా వేశారు.

పోలీసులకు చిక్కిన డిజిటల్ కేటుగాళ్లు


కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వివేకానంద. వెనుక నిందితులతో పోలీసులు

- రూ.13.5 లక్షలతో మహిళా వైద్యురాలిని బురిడీ కొట్టించిన వైనం
- జిల్లాలో తొలిసారి డిజిటల్ అరెస్టు కేసు ఛేదించిన పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లాకేంద్రం సమీపంలోని రాగోలు జెమ్స్ మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న మహిళా వైద్యురాలు ప్రొఫెసర్ రేవతిని మోసగించిన డిజిటల్ కేటుగాళ్లు ఎట్టకేలకు పోలీసులకు చిక్కారు. వైద్యురాలికి ఫోన్ చేసి హ్యూమన్ ట్రాఫికింగ్ చేస్తున్నారంటూ బెదిరించి సీబీఐ డిజిటల్ అరెస్టు పేరిట రూ.13.5 లక్షలకు టోకరా వేయడంతో బాధితురాలు గత నెల 14న ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్పీ మహేశ్వరరెడ్డి సూచనలతో డీఎస్పీ సిహెచ్ వివేకానంద పర్యవేక్షణలో సీఐ సీహెచ్ పైడపునాయుడు ఎస్ఐలు హరికృష్ణ, రాజేష్‌లు బృందాలుగా విడిపోయి కేసును ఛేదించారు. ఈ మేరకు డీఎస్పీ వివేకానంద శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు.

వైద్యురాలికి బెదిరింపు ఫోన్‌కాల్స్‌తో..

గత నెల 14న ఉదయం పది గంటల సమయంలో వైద్యురాలికి గుర్తు తెలియని నెంబర్ల నుంచి పదే పదే ఫోన్లు వచ్చాయి. బెంగళూరులోని అశోక్ నగర్ పోలీస్ స్టేషన్ నుంచి ఫోన్ చేస్తున్నామని.. మీ ఆధార్ నంబర్‌తో లింక్ అయిన ఫోన్ నంబర్‌కు హ్యూమన్ ట్రాఫికింగ్(మహిళలను, యువతులను బ్లాక్‌మెయిలింగ్ చేస్తూ అక్రమంగా తరలించడం)కు సంబంధం ఉన్నట్లు తేలిందని, దాని వల్ల మీ బ్యాంకు ఖాతాలో డబ్బులు పడుతున్నాయని, చట్టరీత్యా ఇది నేరమని, సీబీఐ అధికారులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారని, డిజిటల్ అరెస్టు చేస్తారని భయపెట్టారు. కోర్టులో మీ తరఫున వాదించడానికి కొంత సొమ్ము డిపాజిట్ చేస్తే డిజిటల్ అరెస్టు ఆగుతుందంటూ మాయమాటలు చెప్పి రూ. 13.5 లక్షలను ఏపీలోని జగ్గంపేట అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. తర్వాత కాల్స్ రాకపోవడంతో మోసపోయానని గ్రహించిన వైద్యురాలు పోలీసులను ఆశ్రయించారు. ఎస్ఐ రాజేష్, వెంకటరమణ, ఈశ్వరరావు, ధనలక్ష్మిల బృందం పదిరోజులు బయట రాష్ట్రాల్లోనే ఉంటూ దర్యాప్తు చేపట్టారు. వీరికి జిల్లా సైబర్ సెల్ పోలీసులు సహకారమందించారు. జగ్గంపేట అకౌంట్ ఫేక్‌దని గుర్తించారు.

పెట్రోల్ కొట్టడంతో దొరికిపోయి..

కేరళ రాష్ట్రంలోని మలబార్ తీరం వెంబడి ఉన్న కోజికోడ్ (కాలికాట్) నగరం ఓజీపాడుకు చెందిన నౌఫలా షెరీన్(24) తన బాయ్‌ఫ్రెండ్‌కు స్కూటీలో పెట్రోల్ కొట్టించడానికి బంక్ వద్దకు వెళ్లి తన ఖాతానుంచి రూ.120 డ్రా చేయడం..అక్కడి సీసీ ఫుటేజీ ఆధారంగా బండిని గుర్తించి చిరునామా తెలుసుకోవడంతో సూత్రధారులెవరన్నది తెలిసింది. దుబాయ్‌కు చెందిన సలీమ్ అనే వ్యక్తి ఖాతా నుంచి నౌఫలా షెరీన్‌కు రూ. 6 లక్షలు పడినట్లు తేలడంతో మొత్తం తీగ లాగారు. కర్ణాటక రాష్ట్రం మైసూర్‌కు చెందిన రూమన్ షరీఫ్, రెయాన్ అహ్మద్ ఖురేషీలు వాయినాడ్ కేంద్రంగాను, నౌఫలా షెరీన్, నిజాముద్దీన్ సీపీ (కేరళ), ఫహద్ అహ్మద్‌లు కేరళలోని కోజికోడ్ కేంద్రంగాను రెండు బ్యాచులుగా వీడి ఈ నేరాన్ని లింక్‌సిస్టమ్‌లా చేశారని పసిగట్టారు. వీరికి దుబాయ్‌లో ఉన్న సలీమ్ మంచి స్నేహితుడు కావడంతో అంతా పథకం ప్రకారం చేశారని, అయాన్ అనే వ్యక్తి కూడా ఇందులో భాగస్వామిగా ఉన్నారని, హర్యానాకు చెందిన మరికొందరు ఉండొచ్చని విచారణలో తెలుసుకున్నారు. పైన పేర్కొన్నవారంతా స్నేహితులు కావడం.. వారి సంపాదన విలాసాలకు చాలక పోవడంతో అక్రమ మార్గంలో డబ్బులు సాధించాలనే లక్ష్యంతోనే ఈ నేరం చేశారు. బాధితులు వేసే సొమ్ము వారి అకౌంట్లలో పడ్డాక క్షణాల్లో అమౌంట్‌ను డ్రా చేసి ఖాతాలను క్లోజ్ చేసి వారి వారి వివిధ అకౌంట్లలోకి ట్రాన్స్‌ఫర్ చేసేస్తారు. ఈ విధంగానే సలీమ్ నౌఫలాకు రూ. 6 లక్షలు, రెయాన్ అహ్మద్ ఖురేషి రూమన్‌షరీఫ్‌కు రూ.5.80 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేశారు.

పట్టుబడ్డారిలా..

ఈ క్రమంలో ఈ నెల 13న కొందరి నుంచి బ్యాంకు అకౌంట్లు కొనే నిమిత్తం రూమన్‌షరీఫ్, నౌఫలా షెరీన్, నిజాముద్దీన్ సీపీ విశాఖపట్నం వస్తున్నట్లు ఒకటో పట్టణ సీఐ పైడపునాయుడుకు సమాచారం వచ్చింది. మధ్యాహ్నం ఒంటిగంటకు విశాఖ రైల్వే స్టేషన్లలోసిబ్బందితో మాటువేసి పట్టుకున్నారు. అనంతరం రూమన్ షరీఫ్ నుంచి రూ.లక్ష, నౌఫలా షెరీన్ నుంచి రూ. 2.5 లక్షలు, నిజాముద్దీన్ నుంచి రూ. 2.5 లక్షలు మొత్తంగా రూ. 6 లక్షల నగదు, మూడు మొబైళ్లను స్వాధీనం చేసుకున్నారు. సీఐ పైడపునాయుడు కేసును చాకచక్యంగా ఛేదించారని, మైసూర్, కోజికోడ్ ప్రాంతాలు తిరిగి కేసును ఛేదించిన ఎస్ఐ రాజేష్ బృందాన్ని, ఎస్ఐ హరికృష్ణలను డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

మృతురాలి వివరాలు లభ్యం

ఎచ్చెర్ల: జర్జాం సమీపంలో జాతీయ రహదారి పక్కన అపస్మారక స్థితిలో పడి ఉన్న గుర్తు తెలియని మహిళ ఈ నెల 12న రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం విదితమే. ఈమెది వీరఘట్టం గ్రామంగా పోలీసులు గుర్తించి శనివారం పోస్టుమార్టం నిర్వహించారు.

9 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

గార: వాడాడ పంచాయతీ అచ్చెన్నపాలెం సమీప తోటల్లో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి 8 సెల్‌ఫోన్లు, రూ.16,400 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఏఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపారు.

నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారు బాబు?



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలు ఏమయ్యాయని, ముఖ్యంగా నిరుద్యోగ భృతి ఎప్పుడు ఇస్తారో స్పష్టత ఇవ్వాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మొజ్జాడ యుగంధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాస్ డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి ఇవ్వకపోతే మంత్రుల కార్యాలయాలు, కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. శనివారం జిల్లా కేంద్రంలోని క్రాంతిభవన్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువత ఓట్లతో అధికారం చేజిక్కించుకున్న కూటమి ప్రభుత్వం ఇప్పుడు వారి ఆశలపై నీళ్లు చల్లారని మండిపడ్డారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాదికాలంలో ఏం సాధించారని సంబరాలు చేసుకుంటున్నారో చెప్పాలన్నారు. రాష్ట్రంలో 18 నుంచి 50 ఏళ్ల వయసు కలిగి ఏ ఉపాధి లేనివారు 1.56 కోట్లు మంది ఉన్నట్లు ప్రభుత్వ గణాంకాలే తెలియజేస్తున్నాయని గుర్తు చేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పించి, నిరుద్యోగ భృతి ఇవ్వాలని, లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళనకు పిలుపునిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు అరవింద్, వేణు, రాము, రామోజీ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద ఘటనలో దురుద్దేశం లేదు : ఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్ : హిరమండలంలోని ఆధ్యాత్మిక కేంద్రం కూర్మ గ్రామంలో జరిగిన అగ్నిప్రమాద ఘటనలో ఎలాంటి దురుద్దేశం లేదని, పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపడుతున్నామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 10న కూర్మ వద్ద అగ్నిప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో వ్యక్తిగతంగా, అల్లరిమూకల ప్రమేయం లేదని, గ్రామస్తులు నిత్యం దీపాలు వెలిగించి పూజ చేసిన అనంతరం దీపాలు ఆర్పేసి వెళ్లిపోతాం అని చెప్పారని.. అయినప్పటికీ ఏదైనా దీపం పొరపాటున పూర్తిగా ఆరకుండా ప్రమాదం సంభవించి ఉండొచ్చని ప్రస్తుతం భావిస్తున్నామని అన్నారు. ఇప్పటికే ఘటనాస్థలిలో భౌతికాధారాలు సేకరించి ఫోరెన్సిక్ ల్యాబ్ విజయవాడకు పంపామని, సాంకేతిక ఆధారాలను బట్టి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామన్నారు. ప్రజలు అవాస్తవాలు, వదంతులు నమ్మవద్దని, ఎవరైనా ప్రచారం చేస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

ప్రాణరక్షణ కల్పించాలని పోలీసులకు ఫిర్యాదు

కవిటి: అగ్రవర్ణ కులాలకు చెందిన అధికార పార్టీ నేతల నుంచి తనకు ప్రాణహాని ఉందంటూ డిగొనపపుట్టుగకు చెందిన బోనెల హరికృష్ణ శనివారం కవిటి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మే 28న డిగొనపపుట్టుగలో తనపై జరిగిన దాడి అనంతరం బెదిరింపులు వస్తున్నాయని, అగ్రవర్ణ కులాలకు చెందిన ముగ్గురుపై తనకు అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనిపై ఎస్ఐ రవివర్మ స్పందిస్తూ విచారణ చేపట్టి బాధ్యులపై సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు.

రెవెన్యూ బదిలీలు పూర్తి

- సిఫారసు లేఖలకే పెద్దపీట

శ్రీకాకుళం పాతబస్టాండ్ : జిల్లాలోని రెవెన్యూ విభాగంలో ఈ ఏడాదికి సంబంధించి బదిలీలు పూర్తయ్యాయి. శతశాతం బదిలీలు స్థానిక మంత్రులు, ఎమ్మెల్యేలు సిఫార్సు లేఖలతోనే జరిగాయి. అధికారులు అవసరం మేరకు సిబ్బందిని కార్యాలయాలకు తెచ్చుకోవడం గానీ, ఇతర కార్యాలయాలకు పంపించడం వంటి కనీస హక్కులు కూడా లేకుండా పూర్తిగా రాజకీయ బదిలీలు మాత్రమే నిర్వహించారు. ముఖ్యంగా డ్యూటీ క్యాడర్ ఆర్ఐ క్యాడర్‌లో ఏడాది పూర్తి కాకముందే బదిలీలైన సందర్భాలు కూడా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రెండోసారి చేపట్టిన ఈ బదిలీల్లో పారదర్శకత లేదని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, అంతర్ జిల్లా బదిలీలు కూడా కొంతమందికి జరగలేదు. కేవలం సిఫార్సు ఆధారంతోనే పదోన్నతులు, బదిలీలు నిర్వహించడంతో పక్క జిల్లాల నుంచి మన జిల్లాకు వచ్చే అవకాశం లేకపోయింది.

- సూపరింటెండెంట్లు, డీటీ క్యాడర్‌లో ఉన్న సివిల్ సప్లయ్ డీటీ, సర్వేయర్లకు పెద్ద ఎత్తున బదిలీలెఉ నిర్వహించారు. సివిల్ సప్లయ్ విభాగాల్లో 38 మందికి బదిలీలు చేస్తూ పోస్టింగ్ ఉత్తర్వులను విడుదల చేశారు.
- సీనియర్ అసిస్టెంట్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లలో 19 మందికి బదిలీలు జరిగింది. వీరిలో చాలామంది ఏడాదిలో లోపే మళ్లీ బదిలీ కావడం గమనార్హం.
- తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలు, కలెక్టరేట్ నుంచి 18 మంది జూనియర్ అసిస్టెంట్లను వేరువేరు ప్రాంతాలకు బదిలీ చేశారు. సంతబొమ్మాళి తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్/కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న పి.జగదీశ్వరికి పోలాకి తహశీల్దార్ కార్యాలయానికి బదిలీ చేశారు.